

సొంత జిల్లాకు నిధులిచ్చేరా..?



◆ నేడు రాష్ట్ర బడ్జెట్
◆ ఆర్థిక మంత్రిపై ఉమ్మడి జిల్లా ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రెండవసారి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శుక్రవారం నాడు అసెంబ్లీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే బడ్జెట్ కూర్పును పూర్తి చేశారు. శుక్రవారం జరిగే అసెంబ్లీ సమావేశంలో ఆయన రెండవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మూడు మాసాల క్రితం తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌ను రెండవసారి ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాపై ఏ మేరకు ప్రేమను కనబరుస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేశవ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం, అనంత జిల్లా పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహనుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి ముఖ్యమైన సమస్యలకు బడ్జెట్ ద్వారా ఏ విధంగా పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తారన్నది చూడాల్సి ఉంది.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత లభించాలి

అనంతపురం జిల్లా అంటూనే నిత్యం కరువులకు నిలయం. ఇటువంటి చోట్ల సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యత చాలా ఉంది. ఇంత వరకు ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులకు తగినంత ప్రాధాన్యత లభించలేదన్న విమర్శ ఉంది. ఈ విషయాలు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా స్పష్టమైన అవగాహనుంది. జిల్లాకు ఏకైక నిఖర జలాలున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. నీరు తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా ఉన్నా జిల్లాకు తెచ్చుకోలేకపోతున్నాం. ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ మధ్యలోనే అటకెక్కింది. తక్షణం దీన్ని ఆధునీకరించాల్సి ఉంది. ఈ ఆధునీకరణకు బడ్జెట్‌లో ఏ మేరకు ప్రాధాన్యత లభిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ సొంత నియోజకవర్గంలో ఉన్న పిఎబిఆర్ పూర్తయి నాలుగుదశాబ్దాలు గడుస్తున్నా పూర్తి సామర్థ్యంతో నింపలేకపోతున్నారు. ఇప్పటికీ నాలుగు వేల ఎకరాల వరకు భూసేకరణ జరగాల్సి ఉంది. మరమ్మతులకు జియోమెమ్రైన్ పద్ధతుల్లో చేపట్టాలి. ఇందుకు నిధులు అవసరమవుతాయి. హంద్రీనీవా మరో ప్రధాన ప్రాజెక్టుగా ఉంది. ఈ ప్రాజెక్టు మొదటి బడ్జెట్‌లోనే నిధులు కేటాయించినప్పటికీ దీనిపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లావాసులు మొదటి, రెండో దశలో కాలువల వెడల్పు కోరుతుంటే ప్రభుత్వం రెండో దశలో లైనింగ్‌కు నిధులిచ్చింది. లైనింగ్ చేయడం ద్వారా భూగర్భజలాలు తగ్గిపోయి నష్టపోతామని రైతులు వాపోతున్నారు. దీనికి వ్యతిరేకంగా నిరసనలూ చేపడుతున్నారు. మొదటి విడత కాలువ వెడల్పునకు ఎటువంటి చర్యలు ఈ బడ్జెట్‌లో తీసుకోనున్నారన్నది చూడాల్సి ఉంది.

తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితీ దయనీయమే

ఉమ్మడి జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ఉమ్మడి జిల్లాకు తాగునీటి అందించే వాటిల్లో ప్రధానంగా ఉన్నది సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టులు. సత్యసాయి ప్రాజెక్టు ఎప్పుడో నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనికి తరచూ మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో నీటి సరిఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇక కార్మికుల వేతనాలకు ఎప్పుడూ ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. దీనికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి ఉంది. సాధారణ నిర్వహణ నిధుల నుంచి ఇస్తుండటంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటికి బడ్జెట్‌లో ఏ రకమైన పరిష్కారాలు చూపనున్నారనది చూడాల్సి ఉంది.

ఇవి కూడా....

సాగు, తాగునీరు కాకుండా రైతాంగ సమస్యలు అనేకమున్నాయి. గిట్టుబాటు ధరల్లేవు. ఉద్యానవనానికి ఊతమిస్తామన్న ప్రకటనలు మినహా చర్యలేవీ ఉండటం లేదు. సబ్సిడీలు పెంచాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లావాసులు కోరుతున్నారు. వీటన్నింటికీ బడ్జెట్ కేటాయింపుల్లో అనంతపురం జిల్లాకు ఏ విధమైన సహాయ సహకారాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అందించనున్నారన్నది చూడాల్సి ఉంది.

అధికార పక్షం.. అధికారుల అండదండలు ఉండాలే గానీ ఏ ప్రభుత్వ భూమినైనా ఇట్టే ఆక్రమించేయొచ్చని ఓ రియల్టర్ నిరూపించాడు. యథేచ్ఛగా అసైన్డ్ భూమి, నదీ పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి దాని చుట్టూ కంచె వేశాడు. ఇదేమిటని అడిగిన రైతులపై అక్రమ కేసులనూ బనాయించారు. 'అధికార' మద్దతున్న రియల్టర్‌ను ఎదిరించలేక రైతులు మిన్నకుండిపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వ పెద్దలైనా రియల్డర్ చెరలో ఉన్న భూమిని బయటకు తెస్తారాని చిలమత్తూరు మండల రైతులు ఎదురుచూస్తున్నారు.



రియల్టర్ ఆక్రమణ..!

◆ అసైన్డ్ భూములు.. చిత్రావతి నదినీ వదలని వైనం
◆ రియల్టర్‌కు గత ప్రభుత్వం.. అధికారుల అండ..!?
◆ కూటమి ప్రభుత్వం పైనే రైతుల ఆశలు
◆ చెరలో ఉన్న భూములను విడిపిస్తారని ఎదురుచూపు..

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండలం కొడికొండ, కోడూరు, నారేముద్దేపల్లి, మద్రిమాకులపల్లి రెవెన్యూ పొలాల్లో బెంగుళూరుకు చెందిన ఓ రియల్టర్, అతని కుటుంబ సభ్యుల పేరుతో రీసర్చ్ కేంద్రాల మాటున సుమారు 436 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. దీంతో పాటు ప్రభుత్వ అసైన్డ్ భూములు, వంకపోరంబోకు భూములు అనాధికారికంగా సుమారు 600 ఎకరాలు ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు ఇరిగేషన్ వంకలు, చిత్రావతి నదీ పరిహార ప్రాంతమూ ఉంది. వీటన్నింటికీ కంచెవేసి ఆ రియల్టర్ ఆక్రమణలో ఉంచుకున్నాడు. ఏకంగా చిత్రావతి నదిని ఆక్రమించి కంచె వేయడం గమనార్హం. దీనిపై గతంలో ప్రజాసంఘాలు, రైతులు వివిధ రూపాల్లో పోరాటాలు చేసినా అప్పటి ప్రభుత్వంలో స్థానిక నాయకుల అండదండలు ఉండటంతో ఆక్రమణలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

రియల్టర్ స్వాధీనంలో ఉన్న భూములు..

కోడూరు రెవెన్యూ పోలం సర్వే నెంబర్ 658-4 విస్తీర్ణం 1.33, 678-1 విస్తీర్ణం 2.21, సర్వెనెంబర్ 679-1 విస్తీర్ణం 7.98 సెంట్లు, 679-2 విస్తీర్ణం 4.02 సెంట్లు, 679-3 విస్తీర్ణం 5.30 సెంట్లు, కొడికొండ రెవెన్యూ పొలంలో 12-2లో 6.41 సెంట్లుతో పాటు అసైన్డ్ భూమిని వారి స్వాధీనం చేసుకుని కంచె వేసుకుని ఆక్రమణలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులే స్వయంగా నిర్ధారించారు.


చిత్రావతి నదిపై అక్రమంగా నిర్మించిన బ్రిడ్జి

కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు

రియల్టర్ ఆక్రమణతో భూములకు దారిలేక కొంత మంది భూమిని వదిలేసుకుంటే.. మరికొంత మంది వారి పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు వదలాలని పోరాటం చేస్తున్నారు. ఓ రైతుపై అక్రమ కేసు పెట్టడంతో కోర్టుకు తిరుగుతున్నాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆక్రమణలకు గురైన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, లేదా రైతులకు తిరిగిస్తుందని ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో మండల రైతులకు భూములు తిరిగివస్తాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెడ్డప్ప శెట్టిపై కేసునమోదు

రియల్టర్ రెడ్డప్ప శెట్టిపై చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 25వ తేదీన కేసు నమోదు అయింది. నదిపై అనధికారికంగా బ్రిడ్జ్ నిర్మించడంపై ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిడిపిపి యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

వంక పోరంబోకు, అసైన్డ్ భూములకు కంచె..!

రియల్టర్ వేసుకున్న కంచె లోపలే వంక పోరంబోకు భూములు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు సుమారు వంద ఎకరాలకు పైబడి ఉన్నాయి. ఈ విషయాన్ని గతంలో స్వయంగా రెవెన్యూ అదికారులు స్పష్టం చేశారు. ఆక్రమణలో ఉన్న వంక పోరంబోకు భూములను బయటకు తెచ్చేందుకు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీనికి తోడు పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం ఆక్రమించుకుని చుట్టూ కంచె వేసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. పొలాలకు దారి మూసుకుపోవడంతో కిందనున్న రైతులు ఆ రియల్టర్ చెప్పిన ధరకు భూములను అమ్ముకోవాల్సి వచ్చింది. మరికొంత మంది రైతులు గత 15 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారుల నుంచి స్పందన కరువైంది.

చిత్రావతి నది, ఇరిగేషన్ కాలువల ఆక్రమణ

చిత్రావతి నదితో పాటు ఇరిగేషన్ కాలువలను సైతం రియల్టర్ ఆక్రమించారు. ఏకంగా చిత్రావతి నదిపై బ్రిడ్జిని నిర్మించడంతో పాటు, ఇరిగేషన్ కాలువల నీరు కుంటల్లో చేరేలా ప్లాన్ చేసి పెద్దపెద్ద కుంటలను నిర్మించుకున్నాడు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆస్తులుగా ఉన్న కాలువలు, చిన్న డ్యాంలను సైతం ఆక్రమించు కున్నా అధికారులు పట్టించు కోవడం లేదు. ఈ ఆక్రమణలపై పత్రికల్లో వార్త కథనాలు వచ్చినప్పుడు రిపోర్ట్‌ల పేరుతో నానా హంగామా చేసే అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

రియల్టర్ రెడ్డప్ప శెట్టి కంచె లోపల వేసుకుని ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములు, వంక పోరంబోకు భూముల కంచె తొలిగించి ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలి. చిత్రావతి నదిపై అనాధికారికంగా నిర్మించిన బ్రిడ్జిని ఇరిగేషన్ అదికారులు తొలిగించాలి. తాము డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి ఈ ఆక్రమణల విషయాన్ని తీసుకెళ్తాం.

చిన్నా ప్రవీణ్, జనసేన మండల కన్వీనర్

భూ సేకరణ పెండింగ్ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూ సేకరణ పనులు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో ఎన్‌హెచ్ 342, ఎన్ హెచ్ 716 జాతీయ రహదారుల కోసం చేపట్టిన వివిధ భూసేకరణ పనులు పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులకు సేకరించిన భూమి లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రారంభమైన పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎన్‌హెచ్ 342 ప్యాకేజీ కింద బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం, పెడపల్లి, బూదిలి గ్రామాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బుచ్చయ్య గారి పల్లి గ్రామంలో అదనపు భూమి లభ్యతను తనిఖీని డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణలో చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2 లో పుట్టపర్తి మండలం కప్పల బండ పొలంలో పెండింగ్‌లో ఉన్నాయని బూదిలి గ్రామంలో ఎస్ డబ్ల్యు పిసి షెడ్ల తరలింపు భూమి లభ్యతపై చర్యలు చేపట్టాలన్నారు. లో వోల్టేజీ విద్యుత్ లైన్ మార్పు ప్రారంభమైందని మూడు షిఫ్టింగ్ లైన్లకు ఎటువంటి సమస్య ఉండదని అన్నారు. అలాగే శెట్టిపల్లి గ్రామంలో అదనపు నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, ఆర్డీవోలు కదిరి శర్మ, పెనుగొండ ఆనంద్ కుమార్, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, మహేష్, చిలమత్తూరు, గోరంట్ల, హిందూపురం, బుక్కపట్నం తహశీల్దార్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు భూ సేకరణ వేగవంతం చేయాలి

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో రైల్వే నిర్మాణ పనులు ఎపిఐసిసి భూముల్లో పరిశ్రమల ఏర్పాటు పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వారం ముఖ్యమంత్రి చంద్రబాబు భూ సేకరణ పై పరిశ్రమల స్థాపన పై ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం భూ సేకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో ఆర్ అనంతపురం, గౌడనహళ్లిలో పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. సుమారు 38 ఎకరాలు ఆ ప్రాంతంలో భూముల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయా పరిధిలో అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ విజయసారథి, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సోని సహాని, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తప్పని ఆధార్ తిప్పలు


ఆధార్‌కేంద్రం వద్ద ప్రజల పడగాపులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలానికి కేటాయించిన మూడు ఆధార్ సెంటర్లు సరిగా పనిచేయకపోవడంతో మండల ప్రజలకు ఆధార్ అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని మూడవ సచివాలయంలో ఉన్న ఒకే ఆధార్ సెంటర్ పనిచేస్తుండటంతో గురువారం పండగ రోజు అయినా కూడా ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో సోమందేపల్లి టౌన్, పందిపర్తి , చల్లాపల్లి సచివాలయాలకు ఆధార్ సేవలు కేటాయించగా పందిపర్తి డిజిటల్ అసిస్టెంట్‌ను పింఛన్ల వెరిఫికేషన్‌కు కేటాయించడంతో అక్కడ ఆధార్ సేవలు నిలిచిపోయాయి. చల్లాపల్లి సచివాలయంలో నెట్‌వర్క్ రాకపోవడం, సర్వర్ సమస్యతో అక్కడ కూడా ఆధార్ సేవలు నిలిచిపోయాయి మండల వ్యాప్తంగా పనిచేస్తున్న ఒకే ఒక్క ఆధార్ సేవా కేంద్రం సోమందేపల్లిలోని మూడవ సచివాలయంలో ఉంది. ప్రస్తుతం విద్యార్థుల అపార్, బియ్యం కార్డులో ఈ కేవైసీ వేయడం కోసం విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో ఆధార్‌కేంద్రం వద్దకు వెళుతున్నారు. అప్‌డేట్ కోసం, ఈ కేవైసీకి గడువు ఈనెల 28వ తేదీ ముగుస్తుండటంతో మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు విద్యార్థులు ఆధార్ సేవల కోసం సచివాలయం దగ్గర పడిగాపులు కాయ వలసిన పరిస్థితి ఏర్పడింది.

అదనపు బాధ్యతలతో ఉద్యోగుల ఇబ్బంది

సచివాలయాలలో ఆధార్ కోసం పనిచేస్తున్న ఉద్యోగులు సచివాలయంలో వారి సేవలతో పాటు అదనంగా ఆధార్ సేవలు చేయాల్సిన పరిస్థితుల్లో వారు ఒత్తిడికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్కూల్ పిల్లలు అపార్, ఈ కేవైసీ, అప్డేట్ కోసం స్కూల్ వదిలిన అనంతరం ఎక్కువమంది రావడంతో రాత్రి సమయం వరకు పనిచేయవలసి వస్తుందని, మూడవ సచివాలయంలో రోజుకి 30 మందికి పైబడి ఆధార్ సేవలు అందిస్తున్నామని చెబుతున్నారు. అత్యధికమంది రావడంతో టోకన్లు జారీ చేయడం జరుగుతుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం : ఎంపిడిఒ

మండలంలో కేటాయించిన మూడు సచివాలయాలలో కూడా ఆధార్ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అంతేకాకుండా మరో ప్రైవేటు ఆధార కేంద్రం కూడా ఏర్పాటు చేసుకోవడానికి ఆదేశాలు జారీ చేస్తామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు అధికారులకు నివేదిక అందజేస్తామని, ఒకటి రెండు రోజుల లోపల కేటాయించిన సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కియా ఇండియాకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' పురస్కారం

ప్రజాశక్తి-పెనుకొండ

కియా ఇండియా కార్ల పరిశ్రమ ప్రతిష్టాత్మక 'గ్రేట్ ప్లేస్ టు వర్క్', గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా ధ్రువీకరణ పత్రం అందుకుందని కియా ఇండియా ఎండి,సీఈఓ గ్వాంగ్గు లీ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ మార్క్ నమ్మకం, సమగ్రత అధిక పనితీరుకు కియా ఇండియా నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ సర్వేలో కియా ఇండియా ఉద్యోగులలో 92శాతం మంది పాల్గొన్నారన్నారు. ప్లాంట్లోని కార్యాలయ సభ్యులు, లైన్ టీమ్ సభ్యులు, భారతదేశంలోని కార్పొరేట్ ప్రదేశాలలో ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొనట్లు తెలిపారు. ఈ సర్టిఫికేషన్ కియా ఇండియా వర్క్ ఫోర్స్ అత్యంత సానుకూల అవగాహణను ప్రతిబింబిస్తోందన్నారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ మోడల్‌ను అనుసరించి అంచనా వేయడంలో ఐదు కీలక కోణాలు ఉన్నాయని అందులో విశ్వసనీయత, గౌరవం, న్యాయం, ఆత్మగౌరవం ,స్నేహశీలి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని వివరించారు. కియా ఇండియా ఈ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. భారతదేశంలో ఈ ప్రతిష్టాత్మక ధ్రువీకరణ పొందిన అతికొద్ది ఆటోమొబైల్ తయారీ దారులలో కియా ఇండియా ఒకటి అని చెప్పారు.


ధ్రువపత్రం అందుకుంటున్న కియా ప్రతినిధి

నృత్యం .. ఓ వరం.!

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

నాట్యం అనేది ఒక వరం లాంటిదని పట్టణ ప్రముఖులు, ప్రముఖ దాత సంధా రాఘవ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మానస నృత్య కళా కేంద్రంలో శిక్షణ పొందిన 20 మంది చిన్నారులు తమ నృత్యప్రదర్శనను గురువు మానస ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గురువు మానస మాట్లాడుతూ హిందూ సంస్కృతికళాకారులుగా తమ వంతుగా నృత్య ప్రదర్శన చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలు, రాష్ట్రాలలో తమ నాట్య ప్రదర్శనను నిర్వహించామన్నారు. అనంతరం సందా రాఘవ తో పాటు జింకా పురుషోత్తం, దేవస్థానం అర్చకులు ధనుంజయ చేతుల మీదుగా గురువు మానసను ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్నారులకు మెమొంటోలు అందజేసి అభినందించారు.


మెమొంటోలతో విద్యార్థినులు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - బుక్కపట్నం

బుక్కపట్నం పంచాయతీ పరిధిలోని ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు సర్పంచి నాగలక్ష్మి రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బోరుబావిని తవ్వించినట్లు చెప్పారు. అందులో పుష్కలంగా నీరు లభించడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని అన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సాదిక్‌బాషా, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - హిందూపురం

ప్రతియేటా వినాయక నిమజ్జనం సందర్భంగా హిందూపురం పట్టణంలో పలుచోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉంటాయి. వీటిని నివారించేందుకు ఆయా గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులకు పోలీసు శాఖ పక్షాన ముందస్తు అవగాహన కార్యక్రమాలు, గట్టి భద్రతా చర్యలను పోలీసులు చేపడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే గత ఎడాది సెప్టెంబర్ 13న హిందూపురం పట్టణంలో జరిగిన గణేష్ నిమజ్జనానికి ముందు జిల్లా ఎస్పీ వి.రత్న నేతృత్వంలో హిందూపురం డి.ఎస్.పి మహేష్ సరికొత్త ఆలోచనతో ముందుకెళ్లి ప్రశాంత నిమజ్జనానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శాంతియుతంగా వినాయక నిమజ్జనం జరిగేలా పోలీసు శాఖకు సహకరించిన ఐదు వినాయక ఉత్సవ కమిటీలకు నగదు ప్రోత్సాహక బహుమతులను మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లేపాక్షి ఆలయంలో డీఎస్పీ మహేష్ ఆయా గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, రూరల్ సిఐ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్న పోలీసు అధికారులు

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి మడకశిర

మండల పరిధిలోని మనూరు పంచాయతీ ఉప్పిడిపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా తాగునీటి సమస్య ఉండేదని ఆ సమస్యను ఎమ్మెల్యే ఎంఎస్. రాజు పరిష్కరించారని తెలిపారు.

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని రేషన్ కార్డు దారులు ప్రతి ఒక్కరూ సంబంధిత రేషన్ దుకాణంలో ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేషన్ కార్డు దారులు మార్చి 15వ తేదీ లోపు 5 సంవత్సరాల నుంచి 80 సంవత్సరం లోపు ఉన్న ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణంలో ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు.

సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని శాసనకోటలో గురువారం సివిల్ రైట్స్‌డేను గురువారం నిర్వహించారు. తహశీల్దార్ హసీనా సుల్తానా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌరుల హక్కులుచ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రామాంజినప్ప, ఎస్ఐ రంగడుయాదవ్, ఆర్ఐ సిద్దేశ్వర, విఆర్ఒ మద్దిలేటప్ప, సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని దుర్గా పాపానసేశ్వర వీరభద్ర ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, కర్నాటక తమిళనాడు, తెలంగాణ నుండి అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రమనందన్, ఈవో నరసింహ మూర్తి, టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, స్థానిక సర్పంచి ఆదినారాయణ,హిందూపూర్ మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ , పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన తిమ్మమాంబ ఉత్సవాలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని గూటిబైలు గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జాగరణ మహోత్సవాలు గురువారంతో ముగిసాయి. గురువారం రాత్రి ఆర్కెస్ట్రా నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారంతోఉత్సవాలు పూర్తి అయినట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, వెంకట నారాయణ, నారాయణ స్వామి, లేపాక్షి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాడిమర్రి

తాడిమర్రి 132 కెవి సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా దాడి తోట, కునుకుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఇ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలో ఉన్న రెండు అన్న క్యాంటీన్లలో పేద ప్రజలకు నాణ్యత గల భోజనం, అల్పాహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం పట్టణంలోని అన్న క్యాంటీన్లను తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఉన్న ఆహార పదార్థాలను రుచి చూశారు. శానిటేషన్ విషయంలో తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం క్యాంటీన్లో టిఫిన్ తింటున్న వ్యక్తులతో నేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాటికాపర్ల సదస్సు

ప్రజాశక్తి - రొద్దం

హిందూపురంలోని ఇందిరాపార్కు వద్ద శుక్రవారం నిర్వహించే కాటికాపర్ల సదస్సుకు తరలిరావాలని కెవిపిఎస్ నాయకులు రమణ కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం హిందూపురంలోని ఇందిరాపార్క్ వద్ద కాటికాపర్ల సంఘం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాటికాపర్లను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అదేవిధంగా వారి పిల్లలకు ఉచిత విద్య ప్రైవేట్ పాఠశాలలో చదివించాలని, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై 1న సమీక్ష

ప్రజాశక్తి - కదిరి టౌన్

మార్చి 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై మార్చి 1వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనర్ వెండి దండి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో ఆలయంలో సమన్వయ సమావేశము నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చిల్లావారిపల్లిని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - తాడిమర్రి

శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని చిల్లవారిపల్లెలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణ నేపథ్యంలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న గ్రామాన్ని సందర్శించారు. ఘర్షణ విషయం తెలుసుకున్న వెంటనే వారు బుధవారం రాత్రి గ్రామాన్ని సందర్శించి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఇరు వర్గాల మధ్య శాంతియుత ఒప్పందం కుదిర్చారు. రెండు గుర్రపు ప్రతిమలను మహాశివరాత్రి ఉత్సవం శ్రీ కాటి కోటేశ్వర క్షేత్రం నందు యధావిధిగా జరిగే విధంగా శాంతియుత ఒప్పందం కుదిర్చి గ్రామ ప్రజలు మనోభావాలు దెబ్బ తినకుండా చేశారు. ప్రశాంతమైన వాతావరణ నెలకొల్పి యథావిధిగా ఉత్సవాలు జరిగేలా ఆర్డీవో మహేష్ బాబు డీఎస్పీ హేమంత్ కుమార్, తహశీల్దార్ భాస్కర్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. చిల్లా జానాగాని అంకె నల్లపూ గంగిరెడ్డి ఉరుముల దాసుగానపల్లి కాపుల సమక్షంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అలాగే పూజా సేవ ఆధిపత్యం దక్కలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులు వైద్యులను కోరారు.

ఆలయాన్ని సందర్శించిన పరిటాల శ్రీరామ్ :మండల పరిధిలోని చెలవారిపల్లి గ్రామ సమీపం నందు గల శ్రీ కాటి కోటేశ్వర ఆలయాన్ని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ గురువారం దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కలిసిమెలిసి ఉత్సవాలను యథావిధిగా జరపాలని పరిటాల శ్రీరామ్ ఈసందర్భంగా గ్రామస్తులకు సూచించారు. అలాగే ఆలయ నిర్మాణం వచ్చే మహా శివరాత్రి నాటికి పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలని ఈవో నరసింహారాజును కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, మాజీ ఎంపీపీ కొడిదల రాజశేఖర్, మాజీ మండల కన్వీనర్ కొడిదేల సాయి, హర్ష, ముసుగు శ్రీనివాసులు, బ్యాల్ల పార్థసారథి, మద్దినేని రమణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మెరుగైన వైద్యసేవలందించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలను అందించే విధంగా వైద్యులు సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజ్ బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం పట్టణంలోని సాయి నగర్, దుర్గా నగర్, కొత్తపేట, గాంధీ నగర్, శివానగర్లలోగల ప్రైమరీ హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. పలు రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్‌సిడిసిడి సర్వేను వందశాతం సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అక్కడకు వచ్చిన రోగులతో వైద్య చికిత్సల పట్ల ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్. సెల్వియా సాల్మన్, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

అత్తింటి వారిపై వేధింపుల కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తామామలపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు కదిరి పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. కదిరి పట్టణంలోని పార్థ సారథి కాలనీలో నివాసము ఉంటున్న షేక్ షహరూన్ 4 సంవత్సరాల క్రితం కర్నాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా బిల్లూరు గ్రామానికి చెందిన షేక్ రిజ్వాన్‌ను వివాహం చేసుకున్నాడు. ఆ సమయములో ఎటువంటి కట్న కానుకలు తీసుకోకుండా పెళ్లి చేసుకున్నారు. అయితే పెళ్లి అయిన ఒక నెల తరువాత ఆమె భర్త షహరూన్, అత్తామామలు మహమ్మద్ రఫిక్, అత్త జరీన్ తాజ్ కట్నం కోసం రిజ్వాన్‌ను వేధించడం ప్రారంభించారు. తల్లిదండ్రుల వద్ద నుండి 2 లక్షల రూపాయల డబ్బులు కట్నంగా తీసుకుని రావాలని ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వారి వేధింపులు భరించలేని రిజ్వాన్ పుట్టింటికి తిరిగి వచ్చేసింది. ఈసందర్భంగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తామామపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

పోసాని అరెస్టు అప్రజాస్వామికం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

పోసాని అరెస్టు అప్రజాస్వామికమని రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పాలన కొనసాగుతోందని వైసిపి హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి విమర్శించారు. ఈసందర్భంగా ఆమె గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకం కట్టలు తెంచుకుంటోందని, ఈ కూటమి ప్రభుత్వం నియంత పాలన చేస్తోందని విమర్శించారు. కక్షలతో వైసీపీ శ్రేణులను, కళాకారులను సైతం అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా, జిల్లా ఆఖరికి పల్లెల్లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను ఈ కూటమి ప్రభుత్వం వేధించడం, బాధించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. పోసాని కృష్ణమురళి కొన్ని నెలల క్రితమే కుటుంబ సభ్యుల సూచన మేరకు రాజకీయాల నుండి తప్పుకున్నట్టు ప్రకటించారని, రాజకీయాల నుండి తప్పుకున్నా పాత కక్షలను మనసులో పెట్టుకొని పోసానిని అక్రమ అరెస్టు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కూటమి ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు.

మడకశిర :రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమ అరెస్టులతో వేధింపులకు గురి చేస్తున్నారని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోసాని కృష్ణ మురళి అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని పేర్కొన్నారు. న్యాయస్థానం అనేకమార్లు బి.ఎన్.ఎస్111 సెక్షన్ లు వర్తించవని పేర్కొన్నప్పటికీ కూడా ఆ వ్యవస్థలను కూడా పట్టించుకోకుండా అవే సెక్షన్లతో అక్రమ కేసులు నమోదు చేసి ప్రతిపక్ష పార్టీల నాయకులను కళాకారులను వేధిస్తున్నారన్నారు. న్యాయ వ్యవస్థ వ్యాఖ్యలను కూడా పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని ప్రకటించినా పోసానిని వెంటాడి వేధిస్తున్నారని విమర్శించారు.

పింఛన్ల పరిశీలనలో పారదర్శకత పాటించాలి

ప్రజాశక్తి - హిందూపురం

వికలాంగులకు సంబంధించి నిర్వహించే సామాజిక భద్రత పెన్షన్ల పరిశీలన కార్యక్రమాన్ని వైద్యులు పారదర్శకతతో నిర్వహించాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, హిందూపురం కోఆర్డినేటర్ శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వికలాంగుల పింఛన్లు రూ.15వేలు, రూ.10వేలు, రూ. 6 వేలు పొందుతున్న వికలాంగులందరికీ అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో పున్హ పరిశీలన చేస్తున్న వైద్యులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కువగా మాట, వినికిడి లోపం గల నిజమైన వికలాంగుల వద్ద కూడా దళారులు ఆశ చూపి రూ.10 వేల నుండి రూ.20 వేలు వసూలు చేస్తున్నారని, అలాంటి దళారులను ఎవరూ కూడా నమ్మి మోసపోవద్దని సూచించారు. అలా డబ్బులు తీసుకున్న వారి వివరాలను సేకరించి దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు.

వైభవంగా వీరనారాయణ స్వామి ఉత్సవం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని రామాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన వీరనారాయణ స్వామి పరుస వైభవంగా జరిగింది. రామాపురం సమీపంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో జరిగిన పరుసలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. పరుషకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రమాదంలో మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి ఓబుల దేవరచెరువు

మండల పరిధిలోని ఇనగలూరు వద్ద దిన కూలి పని కోసం వెళ్లిన మహిళ రాతి కప్పు విరిగి మీదపడటంతో మృతిచెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని చౌడంపల్లికి చెందిన మహిళా కూలీ అనూరాధ, ఆమె భర్త బండి వెంకటేష్ కోసం దిన కూలి ఇనుగులూరు కోళ్ల ఫారం నిర్మాణపనులకు వెళ్లారు. పనిచేస్తున్న సమయంలో రెండు బండ రాళ్లు అనూరాధ మీద పడ్డాయి. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదంలో భూ యాజమాని నరసింహులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన దిగారు. కదిరి–హిందూపురం రహదారిపై గంట పాటు మతదేహంతో రోడ్డుపై ఉంచి నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి అక్కడికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం జరిగే విధంగా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతురాలికి భర్తతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ఇనగులూరు వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన అనురాధ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి రఘునాథరెడ్డి అన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించారు. మతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు.

వైఎస్ఆర్‌టి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇంద్ర ప్రసాద్ మృతి బాధాకరం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లా వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇంద్ర ప్రసాద్ గుండె పోటుతో మరణించడం బాధాకరమని జిల్లా అధ్యక్షుడు పివి రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఇంద్ర ప్రసాద్ నల్లచెరువు మండలంలో పనిచేస్తూ ఈనెల 25న మృతి చెందాడన్నారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన స్వగ్రామం తలుపుల మండలంలోని ఓదులపల్లికి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితో పాటు అసోసియేషన్ నాయకులు జంషెడ్, శ్రీనివాసులు, జమీర్, ప్రతాప్ రెడ్డి, వాసు, నారాయణ, రామ్మోహన్, కడప జిల్లా నాయకులు వెంకట్ నాథ్ రెడ్డి, నాగేశ్వరరావు, సుభాష్ తదితరులు వెళ్లి ఇంద్ర ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రశాంతి నిలయంలో ముగిసిన అఖండ భజన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో బుధవారం చేపట్టిన అఖండ భజన గురువారం ఉదయం ముగిసింది. 24 గంటల పాటు ఈ అఖండ భజన కొనసాగింది. శివరాత్రి జాగరణ కోసం పలువురు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. పట్టణంలో పలు దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్థానిక ఆంజనేయ స్వామి గుడిలో శివపార్వతుల వివాహ వేడుకలు వేద పండితుల నడుమ నిర్వహించారు. అలాగే పలు దేవాలయాల్లో భజనలతో పాటు జాగరణ చేశారు. పట్టణంలో కొందరు జాగరణ చేస్తున్న వారికి టీతోపాటు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి రొద్దం

అకతాయిలు చేసిన పనిని గమనించి న స్థానికులు స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని రొద్దం నుంచి హిందూపురం వెళ్లే దారిలో ప్రభుత్వ కళాశాల సమీపంలో సబ్ స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కళాశాల ప్రహరీకి ఉన్న ముళ్ళకంపలకు బుధవారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఎక్కువగా వ్యాపించాయి. సబ్ స్టేషన్ నుంచి వచ్చిన విద్యుత్ తీగలు ఈ మంటల్లో కాలిపోయాయి. అదేవిధంగా హిందూపురం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు కూడా మంటలు వ్యాపించాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ అధికారులు, స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది.

ఐడిఎ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా భూపాళం విజయబాబు

ప్రజాశక్తి - హిందూపురం

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐడిఎ) శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా హిందూపురం పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ భూపాళం విజయబాబు నియమితులయ్యారు. అదేవిధంగా గౌరవ కార్యదర్శిగా డాక్టర్ రాఘవేంద్ర దాసరి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ నవీన్ మకం, కోశాధికారిగా డాక్టర్ బాబా ఫక్రుద్దీన్ (కదిరి) నియమితులయ్యారు. అదే విధంగా మహిళా విభాగం దంత వైద్యుల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శ్రీ సత్యసాయి జిల్లా చైర్మన్‌గా డాక్టర్ సురేఖా దేవి, కో చైర్మన్లుగా డాక్టర్ భార్గవి, డాక్టర్ చందన రోహిల్ (పెనుకొండ) ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా డాక్టర్ వివేక్ కుల్లాయప్ప (ధర్మవరం), డాక్టర్ కృష్ణ సుమన్, (పుట్టపర్తి)ను ఎన్నుకున్నట్లు ఐడిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ భూపాళం విజయబాబు తెలిపారు.

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన వరిపంట పొలాలను ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే రామసుబ్బయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ ఎన్ రమేష్ నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వరి సాగు చేస్తున్న రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి, సిబ్బంది నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో మతసామరస్యం

పెద్దమ్మ పరుషలో ముస్లిం సంక్షేమ సంఘం మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ మండలంలో ముస్లిములు మతసామరస్యాన్ని ప్రదర్శించారు. స్థానిక పాతూరులోని పెద్దమ్మ పరుషలో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం సంఘం నాయకులు షేక్ ఖలందర్ మాట్లాడుతూ ప్రపంచంలోని ఏ మతం సారాంశమయినా ప్రేమ మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చింతపండు హైదర్ వలీ, రియాజ్‌బాషా, షరీఫ్, ముబారక్, సొహైల్ , షాకీర్ , బాబా ఫక్రుద్దీన్, దివాకర్ పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ముస్లిం సోదరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - రొద్దం

కర్నాటక రాష్ట్రం పావగడ తాలూకా దొమ్మితిమర్రి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొక యువకుడు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... మండలంలోని రెడ్డిపల్లికి చెందిన చరణ్, తిరుమలేష్, భరత్ అనే ముగ్గురు యువకులు శివరాత్రి జాగరణ కోసం లేపాక్షికి ద్విచక్రవాహనంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బయలుదేరి వెళ్లారు.కర్నాటక రాష్ట్రం పావగడ తాలూకా దొమ్మితి మర్రి సమీపాన వీరు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చరణ్ (19) అక్కడికక్కడే మృతిచెందాడు, తీవ్ర గాయాలపాలైన తిరుమలేష్(22)ను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన భరత్ హిందూపురంలోని ఓప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు చరణ్, చికిత్స పొందుతున్న భరత్ మడకశిరలో చదువుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. మరో మృతుడు తిరుమలేష్ పెనుకొండలో గల కియా పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేసేవాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటో వివరాలు తెలియకపోవటంతో ఆటో ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న మంత్రి సవిత మృతుల కుటుంబాలకు తన సానుభూతి తెలియజేశారు. అంతేకాకుండా చికిత్స పొందుతున్న భరత్‌కు మెరుగైన చికిత్స అందించాలని హిందూపురం ఆసుపత్రి సిబ్బందికి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని పట్టుకోవాలని పోలీసులకు ఆదేశించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ మండలం పోతుకుంట గ్రామానికి చెందిన రామకృష్ణ(56) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి అలవాటు పడిన రామకృష్ణ గ్రామం శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య రత్నమ్మ, ఒక కూతురు ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఐచర్ ఢీకొని 30 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై ఐచర్ వాహనం దూసుకెళ్లిన ప్రమాదంలో 30 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు వాపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం రూరల్ మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఆ క్రమంలోనే గురువారం మండలంలోని జ్వాలాపురం సమీపంలోకి మేపుల కోసం గొర్రెల మందను తీసుకువచ్చాడు. నీటి కోసం గొర్రెలు రోడ్డు దాటుతుండగా జ్వాలపురం బస్ స్టాప్ దాటిన తర్వాత కదిరి వైపు నుండి వస్తున్న ఐచర్ వాహనం గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ. 3 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ ప్రమాదంతో రోడ్డుపై గొర్రెల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రమాదంలో గాయపడిన మరో ఐదు గొర్రెలకు పశువైద్యశాల సిబ్బంది చికిత్సలు చేశారు. గొర్రెలను ఢీకొని ఐచర్ వాహనం నిలపడకుండా వెళ్లిపోయింది. అయితే బత్తలపల్లి టోల్గేట్ వద్ద ఆకులేటి వీరనారప్ప తదితరులు ఐచర్ వాహనాన్ని అడ్డగించి పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రమాదంలో 30 గొర్రెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధిత గొర్రెల కాపరి నారాయణస్వామి కోరుతున్నాడు.



మృతిచెందిన గొర్రెలు

ఘర్షణ...ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మండల పరిధిలోని చెర్లోపల్లిలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్ర గాయాల పాలయ్యారు. గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితుని భార్య బంధువులు తెలిపిన వివరాల మేరకు... శివరాత్రి జాగరణ లో భాగంగా గ్రామ సచివాలయ సమీపంలో జూదం ఆడుతున్న సందర్భంలో వైసిపి కార్యకర్త హరికృష్ణ టిడిపి కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఎవరు ఇళ్లకు వారు వెళ్ళిపోయారు. కొంత సమయం తర్వాత టిడిపి కార్యకర్తలు కులశేఖర్ రెడ్డి, భువన రెడ్డి, దేవానంద రెడ్డి, భయపరెడ్డి తదితరులు హరికృష్ణ ఇంటి వద్దకు వెళ్లి దాడికి దిగారు. ఇంటిపై రాళ్లతో దాడి చేయడంతో హరికృష్ణ తలకు బలమైన గాయాలు తగిలాయి. దీంతో బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తన భర్తకు బలమైన గాయాలు చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని బాధితుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై వేధింపుల కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణానికి వ్యక్తిపై వేధింపులు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. రాయచోటి రోడ్, పొట్టు కొట్టాల వీధిలో నివాసము ఉంటూ టైలరింగ్ పని చేసుకొనే షేక్ దిల్షాద్‌ను పట్టణానికి చెందిన రామాంజినేయులు అనే వ్యక్తి వేధించినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్లు జైలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తాళాలు వేసిన ఇళ్లకు గమనించి పగటి పూట దొంగతనాలు చేస్తున్న భీమినేని అమర్నాథ్ నాయుడు అనే వ్యక్తికి పుట్టపర్తి కోర్టు గురువారం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. నిందితుడు అమర్నాథ్‌ను డిసెంబర్ 25వ తేదీన నల్లమడ సిఐ ఇస్మాయిల్ అరెస్ట్ చేసి అతని నుండి 650 గ్రాముల బంగారం ఆభరణాలు సీజ్ చేసి రిమాండ్ తరలించారు. ఇదే నిందితుడికి గతంలో కదిరి కోర్టు ఒక్క సంవత్సరం జైలు శిక్ష విధించింది. 2024 నవంబర్లో కొత్తచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు నమోదు చేసి వీటన్నిటిపై గురువారం విచారణ జరిపిన కోర్టు సాక్షాధారాలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి నిందితుడికి మూడు సమక్షరాలు జైలు శిక్ష విధించారు. నిందితుడికి జైలు శిక్ష పడే విధంగా, బాధితులకు న్యాయం జరిగే విధంగా దర్యాప్తు చేపట్టిన సిఐ ఇస్మాయిల్‌ను, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమాచారి చంద్రనాయక్‌ను ఉన్నతాధికారుల ప్రశంసించారు .

రోడ్డు ప్రమాదం.. దెబ్బతిన్న కారు

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని కేకాతి క్రాస్ సమీపంలో ఎక్సెల్ వాహనాన్ని తప్పించబోయి ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్నాయి. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ఓ కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మడకశిర వైపు నుంచి ప్రతి రోజు ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లడానికి గుడిబండ మండలానికి కారులో వస్తుంటారు. విధులు ముగించుకొని అదే కారులో మడకశిరకు వెళుతుంటారు. ఈ క్రమంలోనే గురువారం కూడా పాఠశాలకు వచ్చి విధులు ముగించుకొని మడకశిరకు బయలుదేరారు. అదే సమయంలో హిందూపురం నుంచి ఓ గుత్తేదారుని కారు అమరాపురం వైపు వెళుతోంది. కేకాతి గ్రామం క్రాస్ సమీపంలో రెండు కార్లు ఎక్సెల్ వాహనాన్ని తప్పించబోయి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గుడిబండ వైపు నుంచి మడకశిర వైపు వెళుతున్న కారు బలంగా మరొక కారును ఢీకొనడంతో ముందు భాగంలోఉన్న ఫ్రంట్ వీల్ విరిగి ముళ్ళ పొదల్లోకి వెళ్లింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి అపాయం కలగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.